


పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5853 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1020 క్యూసెక్కులు విడుదల చేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్


పింఛన్లు 97 శాతం పంపిణీ పూర్తి



గుంటూరు క్రిస్టియన్‌పేటలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఇస్సాకు

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక మూడో రోజు గుంటూరు జిల్లాలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. జిల్లాలో మూడో రోజు 97.21 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,53,754 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.68 కోట్లు కేటాయించింది. శుక్రవారం సాయంత్రానికి 2,46,683 మంది లబ్ధిదారులకు రూ.67.73 కోట్ల నగదు అందజేశారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 565.50 అడుగుల వద్ద ఉంది. ఇది 245.3435 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,767, ఎడమ కాలువకు 8,280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,816, ఎస్ఎల్‌బీసీకు 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 50,583 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 50,583 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 838.20 అడుగుల వద్ద ఉంది. ఇది 59.1632 టీఎంసీలకు సమానం.

యార్డులో 88,665 బస్తాల మిర్చి అమ్మకాలు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 75,359 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,665 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 60,138 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.3300, మోడల్ ధర రూ.2800 వరకు పలికింది.

పెనుగంచిప్రోలు తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

జగ్గయ్యపేట అర్బన్:ఈ నెల 5 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు నిర్వహించే పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎంపీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, నందిగామ, జగ్గయ్యపేట బస్‌స్టేషన్ల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. తిరునాళ్ల ముగిసే వరకు పెనుగంచిప్రోలు నుంచి జగ్గయ్యపేట రాకుండా డైరెక్ట్‌గా విజయవాడకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట బస్టాండ్ నుంచి ప్రస్తుతం ఉన్న 10 బస్సులకు తోడు అదనంగా మరో పది తిప్పుతామన్నారు. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. భక్తులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

కళాతపస్వితో.. అల్లుకున్న బంధాలు

● దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు గుంటూరు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ● పెదపులివర్రులో విషాదఛాయలు





కథానాయికి సబితకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు విశ్వనాథ్ (ఫైల్)

తెనాలి: కేబుల్ టీవీలు లేని కాలమది.. సెల్‌ఫోన్ సంగతే తెలీదు. సోషల్ మీడియా ఊహల్లోనూ లేని రోజులు. అప్పట్లో తెలుగు సినిమా 'శంకరాభరణం' జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించింది. అంతర్జాతీయ వేదికల్లో ప్రదర్శితమైంది. అదే దర్శకుడు తీసిన సాగరసంగమం రష్యాలోనూ విజయవంతమైంది. స్వాతిముత్యం తొలిసారిగా తెలుగు సినిమాను ఆస్కార్ వరకు నడిపించింది. అలాంటి సినిమాల రూపకర్త కాశీనాథుని విశ్వనాథ్. ఆ దిగ్గజ దర్శకుడి స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లా పెదపులివర్రు. ఇదే జిల్లాతో ఆయనకు విడదీయలేని అనుబంధముంది. పెదపులివర్రు పండిత గ్రామం. విశ్వనాథ్ తాత కాళహస్తిలింగం పండితుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. తండ్రి సుబ్రహ్మణ్యం గ్రామ శివాలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేశారు. ఆ వారసత్వంతోనే విశ్వనాథ్ తన సినిమాల్లో పల్లెటూరుకు, సంగీతానికి, సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేశారు. తన మూలాలను, అనుబంధాలను మరువకుండా గ్రామంతోనూ, జిల్లాతోనూ స్నేహసంబంధాలను కొనసాగిస్తూ వచ్చారు. గుంటూరులోని సాహితీ సమాఖ్యతో అనుబంధం అలాంటిదే. వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణతో విశ్వనాథ్‌కు 35 ఏళ్లనుంచి అనుబంధం. ఒకప్పుడు విజయవాడలో విశ్వనాథ్ సోదరి గిరిజ ఇంట్లో అద్దెకున్న లక్ష్మీనారాయణ అప్పట్లో చిన్మయ మిషన్ యువకేంద్రం కార్యదర్శి. సూత్రధారులు, స్వర్ణకమలం సినిమాలు తీస్తున్న రోజుల్లో తరచూ ఆ ఇంటికి వచ్చే విశ్వనాథ్‌కు లక్ష్మీనారాయణకు కుదిరిన స్నేహం కొనసాగింది. గుంటూరులో సాహితీ సమాఖ్య ఏర్పాటు చేశాక ఏటా ఉగాదికి సాహితీ వసంతోత్సవం జరుపుతున్నారు. తెలుగు ప్రముఖులను సత్కరిస్తున్నారు. తొలి ఏడాది విశ్వనాథ్‌కు ఆ గౌరవం దక్కింది. 2014లో నంబూరులోని వీవీఐటీ కాలేజికి వచ్చినప్పుడు అక్కడ ప్రదర్శించిన 'సాగర సంగమం' సినిమాను 800 మంది విద్యార్థులతో కలిసి తిలకించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ తన స్నాతకోత్సవంలో విశ్వనాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గుంటూరులోని స్వధర్మ సేవాసంస్థ 2011 ఆగస్టులో బృందావన్ గార్డెన్స్‌లోని కళావేదికపై కె.విశ్వనాథ్‌కు 'ధర్మజ్యోతి' బిరుదును ప్రదానం చేసి, రూ.లక్ష నగదును అందజేసింది. అక్కడి వేంకటేశ్వర స్వామి ఆలయం కె.విశ్వనాథ్‌లోని దర్శకుడికి బాగా నచ్చింది. 'శుభప్రదం' అనే సినిమాలో ఒక పాటను ఇదే ఆలయంలో చిత్రీకరించారు. కళల తెనాలి కె.విశ్వనాథ్‌ను పలుసార్లు గౌరవించుకుంది.



పెదపులివర్రుకు వన్నె తెచ్చిన మహనీయుడు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రుకు వన్నె తెచ్చిన కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విశ్వనాథ్ మరణ వార్తను శుక్రవారం సామాజిక మాధ్యమాలు, దినపత్రికల్లో చూసి గ్రామస్తులు కనులు చమర్చాయి. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న విశ్వనాథ్‌కు 2016లో గ్రామస్తులు గ్రామ నడిబొడ్డున ఉన్న శివవైష్ణవాలయాల ఆవరణలో పౌర సన్మానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విశ్వనాథ్ పూర్వీకులు బాలా త్రిపురసుందరి సమేత రాజరాజనరేంద్రస్వామి (శివాలయం)ఆలయ వంశ పారంపర్య స్థానాచార్యులుగా బాధ్యతలు నిర్వహించారు. విశ్వనాథ్‌కు మంచి పేరు తీసుకువచ్చిన శంకరాభరణం సినిమా విడుదలైన రోజునే ఆయన పరమపదించారు. ఈ సినిమా ఫిబ్రవరి 2న 1980లో విడుదలైంది. 2010లో కూచిపూడిలో వెంపటి చినసత్యం విగ్రహావిష్కరణకు విచ్చేసిన విశ్వనాథ్‌ను గ్రామానికి తీసుకువచ్చి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో, దేవాలయంలో సన్మానించినట్లు తానా మాజీ ప్రెసిడెంట్ నాదెళ్ల గంగాధర్, డాక్టర్ ప్రకాశరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ గుత్తా వెంకటరత్నం, పరిశ రమేష్ గుర్తుచేసుకున్నారు.



కె.విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న పెదపులివర్రుకు చెందిన వైష్ణవాలయ అర్చక బృందం (ఫైల్)



గుంటూరులో సాహితీ వసంతోత్సవంలో నాటి జిల్లా కలెక్టర్ జయలక్ష్మితో కె.విశ్వనాథ్

ఉద్దండులకు పేరుగాంచిన పెదపులివర్రు..

సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఈ గ్రామ అల్లుడే. పాటల రచయిత సముద్రాల రాఘవాచారి ఈ ఊరివాసే. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మేనమామ ములుగు కుమారస్వామిది ఈ గ్రామమే. కంచి కామకోటి పీఠాధిపతులు ఆది శంకరాచార్యులు రాసిన వ్యాకరణాన్ని తెలుగులో అనువదించిన వారణాసి సుబ్బయ్య ఈ గ్రామ వాసే. తానా మాజీ అధ్యక్షుడు నాదెళ్ల గంగాధర్, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడా కారిణి గుత్తా జ్వాల ఈ గ్రామానికి చెందిన వారే.

అమరావతిలో కళాతపస్వి జ్ఞాపకాలు

అమరావతి: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ గురువారం రాత్రి కన్నుమూయడంతో అమరావతి వాసులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని సంతాపం వ్యక్తం చేశారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో 1981లో సప్తపది చిత్రాన్ని అమరావతిలో సుమారు మూడు నెలల పాటు చిత్రీకరించారు. హిందీ వర్షన్‌ను కూడా అమరావతి పరిసర ప్రాంతాల్లో 1984లో సుమారు నెల రోజులపాటు షూట్ చేశారు. తెలుగు సప్తపది షూటింగ్ కోసం నటీనటులు గిరీష్‌ప్రధాన్, సబిత, జేవీ సోమయాజులు, అల్లు రామలింగయ్య, రవిశంకర్, హిందీలో జాగుఉతా ఇన్సాన్ సినిమా కోసం మిథున్‌చక్రవర్తి, సినీనటి శ్రీదేవి, రాకేష్‌రోషన్ అమరావతిలో ఉండటంతో నాటి మధుర జ్ఞాపకాలను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. వైకుంఠపురం గ్రామస్తులు కూడా తమ గ్రామంతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని సంతాపం తెలియజేశారు.



కళాతపస్వికి అక్షర నివాళి

తెనాలిటౌన్: కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు ఓ చిత్రకళోపాధ్యాయుడు అక్షర నివాళులర్పించారు. ఆయన దర్శకత్వం, కథలతో చిత్రాల పేర్లను వరుస క్రమంలో రాసి విశ్వనాథ్ చిత్రాన్ని చిత్రీకరించారు. పెదరావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్ర కళాఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఫణిదపు వెంకటకృష్ణ ఈ చిత్రాన్ని గీశారు.

● విశ్వనాథ్ నేను కలసి చదువుకున్నాం



నేను విశ్వనాథ్ పక్కపక్కన ఇళ్లలో ఉండేవాళ్లం. 5వ తరగతి వరకు ఇక్కడే కలసి చదువుకున్నాం. విశ్వనాథ్ తండ్రి వాహిని పిక్చర్ ప్యాలెస్‌లో ఎండీగా పని చేసేవారు. పదేళ్ల ప్రాయంలో విశ్వనాథ్ ఇక్కడ నుంచి విజయవాడ వెళ్లారు. సినీ నేపథ్య గాయకులైన ఘంటసాల వెంకటేశ్వరరావు నాకు స్వయాన బావ. సినిమాలపై మోజుతో ఘంటసాల ద్వారా ప్రొడక్షన్ మేనేజర్‌గా వాహిని స్టూడియోలో చేరాను. కొంత కాలానికి నేను తిరిగి స్వగ్రామానికి వచ్చే శాను. ఏటా దసరా, మహాశివరాత్రి రోజుల్లో విశ్వనాథ్ స్వామివార్లకు పట్టువస్త్రాలు పంపుతుండేవారు. చిననాటి స్నేహితుడిగా నాకు కూడా పట్టు వస్త్రాలు, ధోవతులు పంపేవారు.

– కొదమంచిలి వెంకట సుబ్బారావు,
విశ్వనాథ్ చిననాటి స్నేహితుడు

● విశ్వనాథ్ కారణజన్ముడు



తెలుగు సినిమాకు వన్నె తెచ్చిన మహనీయుడు కళాతపస్వి కె.విశ్వనాథ్. ఎన్నో అద్భుతమైన సినిమాలు చిత్రీకరించారు. ఆయన తీసిన చిత్రాలు తెలుగు సినిమాకే గర్వకారణం. విశ్వనాథ్‌కు మంచిపేరు తీసుకువచ్చిన శంకరాభరణం సినిమాను ఎప్పటికీ తెలుగు ప్రేక్షకుల మదిలో నుంచి చెరపలేము. ఆ సినిమాను నేను కూడా పలుమార్లు చూశాను. ఆయన లేని లోటు ఎన్నటికీ తీరనిది. భట్టిప్రోలు మండలం వెల్లటూరు వాసిగా మా మండలంలో జన్మించిన విశ్వనాథ్ కారణజన్ముడు.

– డాక్టర్ మేరుగ నాగార్జున,
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

పేరేచర్ల-కొండమోడు రహదారికి మహర్దశ!

నాలుగు వరుసలుగా విస్తరణకు రంగం సిద్ధం

- 49.91 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి నిర్ణయం
- 45 మీటర్ల వెడల్పు రహదారికి సేకరించాల్సిన భూమికి హద్దులు
- రెండు జిల్లాల పరిధిలో 464.28 ఎకరాల భూసేకరణ ప్రక్రియ
- భూసేకరణ హద్దులు పరిశీలించిన పల్నాడు జేసీ శ్యాంప్రసాద్



సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు 49.91 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రంగం సిద్ధమైంది. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు ఇదే మార్గం కావడంతో నిత్యం వాహనాల రద్దీతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో రహదారి విస్తరణకు నేషనల్ హైవే అధికారులు ముందుకు వచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారి విస్తరణకు నోచుకోలేదు. గుంటూరు–హైదరాబాద్ ప్రధాన మార్గం కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రద్దీకి తగ్గట్టుగా రహదారి వెడల్పు లేకపోవడం, గుంతలమయం కావడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరి కొందరు గాయాలపాలవుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నాలుగు వరుసల రహదారిగా విస్తరణ చేయాలని ప్రతిపాదనలు పంపడం తప్ప కార్యాచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పట్టుబట్టి ఈ రహదారిని నేషనల్ హైవేలో కలిపించారు. ఆయన పట్టుదలతో చేసిన కృషితో ప్రస్తుతం పేరేచర్ల నుంచి కొండమోడు వరకు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. మేడికొండూరు, సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నారు. మేడికొండూరు మండలంలో గుంటూరు– నరసరావుపేట మార్గంలోని డోకిపర్రు నుంచి మంగళగిరిపాడు, మేడికొండూరులోని దర్గా వరకు 5.5 కిలోమీటర్లు, సత్తెనపల్లి మండలం నంది గామ అడ్డరోడ్డు నుంచి అమరావతి మేజర్ కాలువ, వడ్డవల్లి మీదుగా నరసరావుపేట రోడ్డులోని పరివర్తన పాఠశాల పక్కన డొంక నుంచి వెన్నాదేవిలోని 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుకగా ధూళిపాళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని గోదాము వరకు 11.2 కిలోమీటర్లు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రాజుపాలెం మండలం అనుపాలెం సమీపంలోని ఆర్‌ఓబీ నుంచి కొండమోడు మీదుగా పిడుగురాళ్ల బైపాస్ రోడ్డును కలుపుతూ 2.9 కిలోమీటర్లు నాలుగు వరుసల రహదారి ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో నాలుగు వరుసల రహదారి, బైపాస్ రోడ్ల ఏర్పాటుకు 464.28 ఎకరాల భూసేకరణ ప్రక్రియలో భాగంగా రెండు జిల్లాల పరిధిలో చేపట్టే ప్రభుత్వ, పట్టా భూముల సర్వే నంబర్లు, రైతుల వివరాలను ఇప్పటికే అధికారులు నమోదు చేశారు. భూ సేకరణకు సంబంధించిన హద్దులు, ఎక్కడ ఎంత వరకు భూమి కోల్పోతున్నారు అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ధూళిపాళ్ల నుంచి కంటెపూడి వరకు భూసేకరణలో కోల్పోయే భూమిని పరిశీలన చేసి అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏడీ సర్వే నాగశేఖర్, తహసీల్దార్లు, వీఆర్వోలు, నేషనల్ హైవే అథారిటీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాలుగు వరుసల రహదారి, బైపాస్ రోడ్లకు సంబంధించిన మ్యాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకూడదని భూసేకరణ ప్రక్రియ పక్కాగా జరగాలన్నారు. దీనికి సంబంధించి చేపట్టాల్సిన విధివిధానాలను ఆయన సూచించారు. సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సర్వే అధికారులు, తహసీల్దార్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు రూ.1.01 కోట్లు

- ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, అధికారులు
- నమూనా చెక్కు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేత



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, అధికారులు

నరసరావుపేట: జిల్లాకు సంబంధించి 42 మంది విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకోగా వారిలో 17 మందికి రూ.1.01 కోట్లు విడుదలైనట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. విదేశీ విద్యాదీవెన కింద రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మొదటి విడత సహాయం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న నగదు జమ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీక్షించి ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో సహాయం పొందిన విద్యార్థుల్లో ముగ్గురు ఎస్సీ విద్యార్థులు, ఈబీసీకి చెందిన ఏడుగురు, ముగ్గురు బీసీలు, నలుగురు మైనార్టీలు ఉన్నారన్నారు. విద్యార్థులందరికీ కలిపి తొలి విడతలో రూ.1,01,05,214 నగదు జమైందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు హాజరైన పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పటాన్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మహమ్మద్ ఘనీ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి డి.వరలక్ష్మితో కలిసి నమూనా చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రితో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన కమల్‌హస్సన్ అనే విద్యార్థి తండ్రి మస్తాన్‌వలి మాట్లాడారు.

పంటపొలంలో నేతాజీ

తెనాలి: కొల్లిపర మండల గ్రామం అత్తోటలో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ ముఖచిత్రం ఆకర్షిస్తోంది. ప్రకృతి వ్యవసాయ కేంద్రం 'భూమి భారతి'కి సమీపంలో అర ఎకరం పొలంలో జనుము పంటను నేతాజీ ముఖచిత్ర రూపంలో తీర్చిదిద్దారు. నేతాజీ జీవిత చరిత్రపై ఒక పుస్తకం ఇటీవల హైదరాబాద్‌లో రిలీజయింది. ఆ సభలో పెద్దలు నేతాజీ అస్తికలు జపాన్‌లో ఉన్నట్టుగా వెల్లడించారు. మీడియాలో ఆ విషయం చూసిన అత్తోట ప్రకృతి రైతు యర్రు బాపన్న ఈ అంశానికి విస్తృత ప్రాచుర్యం కల్పించాలని నిర్ణయించుకున్నారు. పంట పొలంలో నేతాజీ ముఖచిత్రం ఆవిష్కృతమైంది. నేతాజీ అస్తికలను మనదేశానికి తీసుకురావాలనే భావన ఇందుకు నేపథ్యమని బాపన్న వెల్లడించారు.



అత్తోట పంటపొలంలో నేతాజీ ముఖచిత్రం

వన్స్‌మోర్ సీఎం అంటున్న జనం



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, వేదికపై అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ కోలగట్ల, మాజీ మంత్రి వెలంపల్లి, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా, నంబూరు, మద్దాళి గిరి

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- ఘనంగా పల్నాడు డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం
- ముఖ్యఅతిథులుగా అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ లావు



పొడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మిట్టపల్లి రమేష్

నరసరావుపేట: గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలనతో వన్స్‌మోర్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలనే సంకల్పం ప్రజలందరిలో కనిపిస్తోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని జమీందారు ఫంక్షన్ హాలులో నిర్వహించిన పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ (పొడా) మిట్టపల్లి రమేష్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ఆదిమూలపు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. స్థానిక శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ఏపీ మెట్రోపాలిటన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం కింద రాష్ట్రంలో 20 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో అతిముఖ్యమైంది పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అన్నారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఎనిమిది మున్సిపాల్టీలు, 28 మండలాలు, 349 గ్రామాలు ఉన్నాయని వివరించారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న దశలో పురవాసులకు అన్నీ వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భౌగోళిక విస్తీర్ణం పెంచేందుకు అర్బన్ డెవలప్‌మెంట్‌లో గ్రామాలను చేర్చారని తెలిపారు. అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత లేదనే లోకేష్ మాటలను ఖండించారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ములేక అన్నీ రాజకీయ పార్టీల చుట్టూ దేహీదేహీ అంటూ చంద్రబాబు తిరుగుతున్నారన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ఆర్యవైశ్యులకు పెద్దపీట వేశారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పొడా ఛైర్మన్ రమేష్, ఆయన తండ్రి మిట్టపల్లి కోటేశ్వరరావు మంచి వ్యక్తులని కొనియాడారు. శాసనమండలి విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పొడా ఛైర్మన్ రమేష్ పల్నాడు ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి తప్పకుండా న్యాయం జరుగుతుంది అనే దానికి రమేష్ ఉదాహరణ అని చెప్పారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందరి ప్రభుత్వమన్నారు. గుంటూరు–2 ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో దేశంలోని 28 రాష్ట్రాల్లో ఏపీ నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే 20 ఏళ్లలో పల్నాడు జిల్లా రూపురేఖలు మారబోతున్నాయన్నారు. పొడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ సీఎం జగన్ మాట ఇస్తే ఎవరు అడ్డుపడినా వెనక్కు తగ్గరన్నారు. తనకే కాదు ఆర్య వైశ్యులందరికీ ఈ పదవి దక్కిందని భావిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం రమేష్‌తో ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎన్విరాన్‌మెంట్ ఛైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, ఏపీ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ లాలుపురం రాము, తహసీల్దార్ ఆర్‌వీ రమణకుమార్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ద్వారక ప్రసాద్, షేక్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆషాబేగం ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల్లో భాగమే ఎడ్ల బలప్రదర్శన

- ఎంపీ లావు, ఎమ్మెల్సీ జంగా
- సేద్యపు (న్యూ కేటగిరి)లో పల్నాడు జిల్లా ఎడ్లకు ప్రథమ స్థానం



సేద్యపు విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇనిమెట్ల ఎద్దు



జూనియర్ విభాగంలో పోటీ ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్సీ జంగా

మాచవరం: సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా తిరునాళ్లలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించడమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని మోర్జంపాడులో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన బండ లాగుడు పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలకు ముందు శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తిరునాళ్ల ఏర్పాటు చేయడంతో పాటు, పశుపోషకులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. బల ప్రదర్శన బండ లాగుడు పోటీల్లో సేద్యపు(న్యూ కేటగిరి) విభాగంలో పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, ఇనిమెట్ల గ్రామానికి చెందిన కంటకం వెంకటేశ్వరావు ఎడ్ల జత 4400 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పమిడి అంజయ్య చౌదరి(ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా) ఎడ్లు 3600 అడుగులు దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలువగా, గొడుగు గోపి(మాచవరం మండలం, పల్నాడు జిల్లా) ఎడ్ల జత 3417 అడుగులు, బండి సాహిత్‌శ్రీ భవణ్ (జిడుగు, అమరావతి మండలం) ఎడ్ల జత 3315 అడుగులు, రాయపాటి శ్రీనివాసరావు (అబ్బూరు, సత్తెనపల్లి మండలం) ఎడ్లు 3160 అడుగులు, పీతా వెంకటేశ్వరావు (జూపూడి, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా) ఎడ్లు 2800 అడుగులు, దోమ మహాశ్రీ కేతనారెడ్డి (కర్లపాలెం, బాపట్ల జిల్లా) ఎడ్లు 2244.8 అడుగులు, కనుమూరి శైలజ (ఇక్కుర్తి, నరసరావుపేట మండలం) ఎడ్లు 2187 అడుగులు దూరాన్ని లాగి వరుస స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ నన్నే, జెడ్పీటీసీ సభ్యుడు శివా యాదవ్, స్థానిక సర్పంచి కృష్ణవేణి, మండల యూత్ కన్వీనర్ మద్దు ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు జిలుగు నరసింహారెడ్డి, ఆవుల నరసింహారెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభను వెలికితీయండి

డీఈఓ వెంకటప్పయ్య



అమరావతి: విద్యార్థుల్లో ఉన్న అంతర్గత ప్రతిభను వెలికితీసే విధంగా విద్యాబోధన ఉండాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య ఆదేశించారు. స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ఆడిటోరియం ఎస్ఏ-1 పరీక్ష ఫలితాలపై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి తిరుమలేష్ అధ్యక్షత వహించారు. డీఈఓ వెంకటప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులందరూ పేదవారేనని వారిని బంగారు భవిష్యత్ బాట వేసుకునే విధంగా ప్రేరేపించాలన్నారు. ఎస్‌టీ-1 పరీక్షల ఫలితాలలో పాఠ్యాంశాల వారీగా సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. అనంతరం పాఠ్యాంశాల రిసోర్స్‌పర్సన్‌లు పాఠ్యాంశాల బోధనలో మెలకువలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డెప్యూటీ డీఈఓ వీఎస్ రావు పాల్గొన్నారు.

రేషన్ పకడ్బందీగా పంపిణీ చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నకరికల్లు: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రేషన్‌సరుకులను కార్డుదారులకు విక్రయించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆదేశించారు. మండలంలోని గుండ్లపల్లిలో రేషన్ పంపిణీ, ఈ-క్రాప్ బుకింగ్‌ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత పంటపొలాల్లోకి వెళ్లి ప్రధానంగా సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మొబైల్‌లోని అప్లికేషన్ ద్వారా ఈ-క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు, పరిహారం మంజూరు చేసేందుకు సులభతరమవుతుందని అన్నారు. ఈ-క్రాప్‌బుకింగ్ చేసిన పంటలకు నూరుశాతం ఈకేవైసీ చేయాలని సూచించారు. గ్రామంలోని 12వ నంబర్ రేషన్ షాపును తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రేషన్ పంపిణీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ వాహనం నిర్వహణను పరిశీలించి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రేషన్‌ను కార్డుదారులకు విక్రయించాలని కోరారు. రైస్‌కార్డుదారుని ఇంటివద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సురేష్, వ్యవసాయాధికారి కె.దేవదాసు పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో రేషన్ పంపిణీ వాహనం తనిఖీ చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

ఉచిత కంటి వైద్యశిబిరం

హాజరైన జిల్లా న్యాయమూర్తి ఓవీ నాగేశ్వరరావు

నరసరావుపేట: కోర్టు ప్రాంగణంలోని శ్రీ కాకుమాను సూర్యనారాయణరెడ్డి కళావేదికలో మాక్స్ విజన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా న్యాయమూర్తి ఓవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కళ్ల పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, డాక్టర్ చెంచిరెడ్డి కళ్ల పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మధుస్వామి, ప్రవల్లిక, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాకుమాను బాలా హనుమంతారెడ్డి, ఉపాధ్యక్షుడు బ్రహ్మానందం, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభంలో పాల్గొన్న న్యాయమూర్తులు, డాక్టర్లు, న్యాయవాదులు

బంగారం మాయంపై ముగిసిన విచారణ

- ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ
- 49 మంది రైతులు బంగారం మాయం
- విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి

సత్తెనపల్లి: మండల పరిధిలోని రెంటపాళ్లలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బంగారం మాయంపై విచారణ ముగిసింది. ఈ నెల 26న 'బ్యాంకులో బంగారం మాయం' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీనిపై బ్యాంక్‌లో 49 మంది రుణ గ్రహీతలకు చెందిన 3149.42 గ్రాముల బంగారం సంచులు మాయం కాగా వాటి విలువ రూ.1.52 కోట్లు గా ఉంటుందని నిర్ణయించి మేనేజర్ సిహెచ్.నాగేశ్వరరావు, సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. బ్యాంకు మేనేజర్ దేశవత్ రాంబాబు నాయక్, అసిస్టెంట్ మేనేజర్ మేటమర్రి రవికుమార్, గోల్డ్ అప్రైజర్ ఇమ్మిడిశెట్టి సంపత్ కుమార్ ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఇదే కాక కొంత రోల్డ్‌గోల్డ్ బంగారంగా చలామణి అయ్యేలా బ్యాంక్‌లో భద్రపరిచారనే విషయం తెలుస్తోంది. అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేయడంతో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయనేది సమాచారం. బంగారం మాయంలో ఎవ్వరి ప్రమేయం ఏ మేరకు ఉందో కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. గోల్డ్ అప్రైజర్ సంపత్ కుమార్ బంగారం మాయంలో కీలక వ్యక్తికి మారగా పెద్ద మొత్తంలో చెల్లించాల్సినట్లు చెబుతున్నారు. పోలీసులు ఈ కేసును ఒకటి, రెండు రోజుల్లోనే బహిర్గతం చేయనున్నారు.

గురుకులంలో తరగతులు పునఃప్రారంభం

- పరీక్షలు దృష్ట్యా ప్రతి విద్యార్థిని హాజరు కావాలి
- ఉమ్మడి గుంటూరుజిల్లా కో ఆర్డినేటర్ శాంతి విశాల



పనులు పర్యవేక్షిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శాంతి విశాల, ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పునఃప్రారంభమైనట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ సి.శాంతి విశాల శుక్రవారం తెలిపారు. త్వరలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు, ఎఫ్ఏ-3 పరీక్షల నిర్వహించనున్నట్లు దృష్ట్యా విద్యార్థినులు వెంటనే వచ్చి గురుకులంలో చేరాలని సూచించారు. నాలుగు రోజులుగా గురుకులంలో పాఠశాల, కళాశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయంలో ప్రభుత్వం త్వరితగతిన స్పందించి గురుకులంలో లోపాలను సరి చేసినట్లు వివరించారు. విద్యార్థినుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని, ఆహ్లాదకర పరిస్థితులను ఏర్పాటు చేశారని చెప్పారు. అంతేకాక ఆహార పదార్థాలు, తాగునీటికి సంబంధించి ప్రత్యేక కమిటీ ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని వివరించారు. ఆమెతో పాటు ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి



మాట్లాడుతున్న సభ్యురాలు పద్మావతి, తదితరులు

నరసరావుపేట: బాలల హక్కులపై అన్ని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెలవులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతినెల రెండో శనివారం, ప్రతి ఆదివారం సెలవులు, వివిధ పండగలు సెలవులు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు, ప్రత్యేక పరీక్షలు పేరుతో క్లాసులు నిర్వహించవదని సూచించారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అగ్నిమాపక పరికరాలు ఉండాల్సిందేనని, ఇరుకు గదులు, వెలుతురు లేని ప్రాంతంలో తరగతులు ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించొద్దన్నారు. ఏదైనా ఫిర్యాదులు 1098 చైల్డ్‌లైన్‌కు అందేలా ప్రతి స్కూలు నోటీసు బోర్డులో అందరికీ తెలిసేలా బహిరంగ పరచాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించిన అంశాలన్ని అమలు జరిగేలా యాజమాన్యాలును సంఘటిత పరిచే ఆదేశాలు జారీచేస్తున్నామని అన్నారు. వీటి అమలుకు తనిఖీ బృందాలను నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ డి.అరుణ, జీసీడీఓ రేవతి పాల్గొన్నారు.

బాలకోటిరెడ్డిపై దాడి టీడీపీ పనే

- ఆయన భార్య ఇంటర్వ్యూతో వెల్లడి
- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



బాలకోటిరెడ్డి భార్య ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూను వినిపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డిపై హత్యాయత్నం టీడీపీ నాయకుడు పమ్మి వెంకటేశ్వరరెడ్డే చేసినట్లు సాక్ష్యాలతో సహా రుజువైందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాట్లాడుతూ హత్యాయత్నం చేసిన పమ్మి వెంకటేశ్వరరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు టీడీపీ గురువారం ప్రకటించిందన్నారు. దీనిని బట్టి ఆ పార్టీకి చెందిన వ్యక్తే హత్యాయత్నం చేసినట్లు రుజువైందని చెప్పారు. దీంతో పాటు బాలకోటిరెడ్డి భార్య ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన భర్తను అడ్డుతొలగించుకుంటే తానే నాయకుడిగా చెలామణి కావచ్చనే ఉద్దేశంతో వెంకటేశ్వరరెడ్డి రెండోసారి తన భర్తపై హత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పినట్లు వివరించారు. దీంతో పాటు ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అమరా వెంకటేశ్వరరావు ఆత్మహత్య ఘటనలో కూడా అధికార పార్టీ నాయకుల బ్యాంకుతో కుమ్మక్కై చేసిన ఒత్తిళ్ల మూలంగానే ఆత్మహత్య చేసుకున్నాడంటూ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ అరవింద బాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. బ్యాంకు ద్వారా వేసిన వేలంలో కళాశాల స్థలం కొనుగోలు చేసిన కళాశాల పాలకవర్గంలో 80 శాతం మంది టీడీపీకి చెందిన వ్యక్తులే అన్నారు. టీడీపీ నాయకులు వ్యవహారశైలిని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా విలేకరులకు బాలకోటిరెడ్డి భార్య ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ, డాక్టర్ అరవిందబాబు విడుదల చేసిన ప్రకటన కాపీలను అందజేశారు.

భార్యపై హత్యాయత్నం

కొల్లూరు: భార్య ప్రవర్తనపై అనుమానంతో ఆమెను హతమార్చేందుకు భర్త ప్రయత్నించిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. చొప్పర చంద్రపాల్, కుమారి అనే మహిళను కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇద్దరికి రెండో వివాహం. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. కుమారి వేరే గ్రామంలోని వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ తనను పట్టించుకోవడంలేదని తరచూ ఆమెతో గొడవపడుతున్నాడు. గురువారం రాత్రి వివాదంతో చంద్రపాల్ సమీపంలో ఉన్న చాకుతో భార్యపై దాడి చేశాడు. క్షతగాత్రురాలిని వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన విషయంలో వైద్యశాల నుంచి వచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, నిందితుడ్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ తెలిపారు.

రూ.1.60 లక్షల విలువైన ఎరువులు స్వాధీనం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు
- 11.57 లక్షల ఎరువుల అమ్మకాల నిలిపివేతకు నోటీసులు



ఓ దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. రూ.1.60 లక్షల విలువైన ఎరువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.11.57 లక్షల విలువైన సరుకు అమ్మకాలను నిలిపివేసి నోటీసులు ఇచ్చినట్లు సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు. వివరాలు.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం ఈమనిలోని గాయత్రి ట్రేడర్స్, జీవిత ట్రేడర్స్ దుకాణాలలో ఎరువుల నిల్వల్లో తేడా గుర్తించారు. దీంతో 10.9 ఎంటీఎస్ ఎరువులు, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సురేష్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో రూ.266.50(ఎమ్మార్పీ) యూరియా బస్తాను రూ.350లకు విక్రయించడంతో 3.425 ఎంటీఎస్ ఎరువులు స్వాధీనం చేసుకుని '6ఏ' కేసు నమోదు చేశామన్నారు. గణేష్ ట్రేడర్స్, వెంకటేశ్వర రైతు సేవా కేంద్రాల్లో అనుమతుల్లేని రూ.11.57 లక్షల 49.6 ఎంటీఎస్ ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకిలోని నాగేశ్వర ట్రేడర్స్‌లో యూరియా బస్తా రూ.266.50 (ఎమ్మార్పీ)కు విక్రయించాల్సి ఉండగా, రూ.300కు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దీంతో రూ.74,586 విలువ చేసే 7.110 ఎంటీఎస్ యూరియా, 1.150 ఎంటీఎస్ డీఏపీని స్వాధీనం చేసుకుని '6ఏ' కేసు నమోదు చేశామన్నారు. వెంకటేశ్వర ట్రేడర్స్‌లో జీరో ఫారమ్స్ లేకపోవడంతో 5.45 డీఏపీ, ఫాక్ట్ ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సీఐ టి.లక్ష్మారెడ్డి, వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, ఎఫ్ఆర్ఓ షేక్ సైదులు, సహాయ జియాలజిస్ట్ ఎన్.ప్రసాద్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.